క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీఅలివేలుమంగ గోదాదేవీ సమేత శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం విశ్వ మానవతా హోమియో వైద్యాలయం ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ శిబిరంలో కీళ్లనొప్పులు, బీపీ, షుగర్, స్త్రీల సమస్యలపై వైద్యులు పరీక్షలు చేసి వైద్య సలహాలిస్తారన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ శిబిరంలో ఉచిత వైద్యసేవలందిస్తామని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెడ్పీటీసీకి ఘన నివాళి



వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ బోస్ తదితరులు

రామచంద్రపురం: ఆకస్మికంగా మృతి చెందిన రామచంద్రపురం జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావుకి వైఎస్సార్ సీపీ నేతులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని గాంధీపేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, కో–ఆర్డినేటర్ సూర్యప్రకాశ్‌లు వెంకటేశ్వరరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లి–కోట రహదారిలో ఉన్న ధన ధాన్యలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద, కోటిపల్లిలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి పలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు అందించారు.

కాజులూరు మండలంలో..

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం మహిళలు వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ వారం శ్రావణమాసం చివరి శుక్రవారం కావటంతో మహిళలు అధిక సంఖ్యలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించి ఆలయాలకు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో మండల గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మండలంలోని 26 గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లోను ప్రత్యేక పూజలు జరిగాయి.

శోకంతో సంతాప దినాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అర్బయీన్ (40 రోజుల సంతాప దినాలు) నిండు శోకంతో ముగిశాయి. అంజుమన్ సంఘాలు, పంజా ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లిం భక్తులు కర్బలా పుణ్యభూమిలో వందల ఏళ్ల క్రితం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమాం హుస్సేన్, ఆయన పరివారం, వీర మరణం పొందడం గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు. శుక్రవారం ఉత్తరప్రదేశ్ నుంచి వచ్చిన మత గురువు మౌలానా మీర్జా మునజీర్ నజీఫీ మజ్లిస్‌ల రూపంలో ప్రవక్తలు అనుభవించిన కష్టాలను వివరించారు. గుర్రాలపై హమాలీలు ఊరేగుతూ మాతం నిర్వహించారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి విరాళం

రాయవరం: మండలంలోని పసలపూడి నాయిబ్రాహ్మణ సేవా సంఘానికి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు రూ.25వేలు విరాళం అందజేశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో విరాళాన్ని నాయిబ్రాహ్మణ సేవా సంఘం పెద్దలకు చైతన్య రాజబాబు అందజేశారు. పోతురాజు స్వామి ఆలయ నిర్మాణం నిమిత్తం ఈ విరాళాన్ని అందజేసినట్లు చైతన్య రాజబాబు తెలిపారు.

ఉచిత బస్సు పథకం ప్రారంభం

కపిలేశ్వరపురం (మండపేట): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మండపేటలో శుక్రవారం ప్రారంభించారు. స్థానిక బస్సు స్టాండ్‌లో ఉచిత ప్రయాణ బస్సుకు కొబ్బరికాయ కొట్టి పథకాన్ని ప్రారంభించారు. అనంతరం తొలి ఉచిత ప్రయాణ టికెట్‌ను మహిళా ప్రయాణికులకు అందజేశారు.

రామచంద్రపురం: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శుక్రవారం సాయంత్రం స్త్రీశక్తి ఉచిత బస్సు పథకాన్ని మంత్రి సుభాష్ ప్రారంభించారు. మహిళలతో కలిసి రామచంద్రపురం డిపో వద్ద నుంచి తాళ్లపొలం వరకు బస్సులో ప్రయాణించారు. స్త్రీ శక్తి పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, ఏడాదికి రూ.1,942 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జీరో ఫేర్ టికెట్ తీసుకుని, ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డు, గుర్తింపు కార్డు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అఖిల, డిపో మేనేజర్ భాస్కరరావు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక శివారు గుడ్డాయలంకలో శుక్రవారం రాత్రి దాడులు చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.2,600 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

మది నిండుగ.. జెండా పండగ

- ఎందరో మహానుభావుల త్యాగఫలం
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- వాడవాడలా స్వాతంత్య్ర వేడుకలు
- చిన్నారుల నోట స్వేచ్ఛాగీతం



స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్న ఎంపీ బోస్, సూర్యప్రకాశ్ తదితరులు

రామచంద్రపురం: స్వాతంత్య్రం పొందడానికి ఆనాడు చేసిన పోరాటంలో ఎందరో మహానుభావులు చేసిన త్యాగఫలమే స్వాతంత్య్ర దినోత్సవ సంబరం అని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ కొనియాడారు. రామచంద్రపురం నియోజకవర్గంలో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని గాంధీపేటలో వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర పోరాటంలో ఆనాటి అమరవీరుల త్యాగాలను గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ జాతీయ భావాన్ని కలిగి ఉండాలన్నారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి స్వాతంత్య్ర ఫలాలను అందివ్వటానికి వైఎస్సార్ సీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఎగురవేసిన అధికారులు

పట్టణంలోని ప్రధాన తపాల కార్యాలయం వద్ద హెడ్ పోస్టుమాస్టర్ శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో అఖిల జాతీయ జెండాను ఆవిష్కరించారు. డీఎస్పీ కార్యాలయం, సీఐ కార్యాలయం, స్థానిక పోలీస్‌స్టేషన్‌ల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ కేఆర్‌ఆర్‌వీ రాజు పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్య్ర వేడుకలు

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం స్వాతంత్య్ర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ మాత భారతీ, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మోహన్‌కుమార్, కాజులూరు లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ వద్ద కార్యదర్శి సత్యనారాయణ జెండాను ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కె.గంగవరం: స్వాతంత్య్ర వేడుకలు శుక్రవారం మండలం వ్యాప్తంగా నిర్వహించారు. గ్రామాల్లోని పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పంపన నాగమణి జెండా ఆవిష్కరణ చేశారు. అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. జెడ్పీటీసీ ఓబులనేని వరలక్ష్మి , ఎంపీడీఓ శ్రీనివాసరావు, బీసీ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జానీ బాషా జెండా ఆవిష్కరణ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్వో ప్రసాద్ అమరవీరులకు నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద జరిగిన వేడుకల్లో ఎంఈఓ నాగరాజు పాల్గొని జెండాను ఎగురవేశారు. మండలంలోని కూళ్ల, పామర్రు, భట్లపాలిక, కె.గంగవరం తదితర గ్రామాల్లోని పంచాయతీల వద్ద జరిగిన వేడుకల్లో పారిశుధ్య కార్మికులను సర్పంచ్‌లు, కార్యదర్శులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అందరి మదిలో జెండా

రామచంద్రపురం రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ప్రజలందరి మది నిండా మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ అంబటి భవానీ జాతీయ జెండాను ఎగురవేశారు. వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి, డిప్యూటీ ఎంపీడీఓ సెలత్‌రాజు, నియోజకవర్గ యంగ్ ప్రొఫెనల్‌గా నియమించబడిన ఆలేటి హరికృష్ణ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై లక్ష్మణ్ జెండా ఎగురవేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామ సచివాలయాల వద్ద ప్రజాప్రతినిధులు జాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు.

జెండాను చేతపట్టి

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గ వ్యాప్తంగా మువ్వెన్నెల జెండా రెపరెపలాడింది. అన్ని వర్గాల ప్రజలు జాతీయ జెండాను చేతపట్టి భారత్ మాతాకి జై అంటూ గళం విప్పి తమ దేశభక్తిని చాటుకున్నారు. మండపేట పట్టణంలోని 30 వార్డులు, రూరల్ మండలంలోని 12 గ్రామాల్లోనూ, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో శుక్రవారం 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లోని విభాగాల్లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున సాగిన ర్యాలీల్లో స్వాతంత్రోద్యమ నినాదాలు చేశారు. మండపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలలోని వేడుకల్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతీ భారతీయుడుకి దైవం పట్ల భక్తి, దేశం పట్ల ప్రేమ రెండూ ఉండాలన్నారు.

మండపేట రూరల్:

మండపేట రూరల్ మండలంలోని 12 గ్రామాల సచివాలయాలు, రెవెన్యూ, ఐసీడీఎస్, పోలీస్ శాఖల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ లక్ష్య సాధనకై కృషి చేయాలన్నారు. మండల పరిషత్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో సందడి నెలకొంది. పలు పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి మాట్లాడుతూ నేటి చిన్నారులు స్వాతంత్రోద్యమాన్ని అవగాహన చేసుకోవాలన్నారు. కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ప్రభుత్వ శాఖల అధికారులు హాజరయ్యారు. టేకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబర్చిన టేకి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత చీకట్ల రామారావు రూ.50,000, గుత్తుల వీరభద్రరావు రూ. 10 వేలు ప్రోత్సాహక బహుమతిగా అందజేశారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో పాల్గొన్న దుర్గారాణి, ఎమ్మెల్యే వేగుళ్ల



కపిలేశ్వరపురంలో జెండా ఎగురవేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ సభ్యులు



మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాయకుల వేషధారణల్లో విద్యార్థులు

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న దుర్గారాణి, పాపారాయుడు, రాధాకృష్ణ, తదితరులు



అంగర పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణలో గూటం సత్యనారాయణ, తదితరులు

మండపేట: 79 స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండపేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచనల మేరకు స్వాతంత్య్ర వేడుకలను పార్టీ శ్రేణులు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ హాజరై జాతీయ నాయకులకు నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ నాయకుల పోరాటాలను నేటి యువత స్మరించుకోవాలని సూచించారు. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, 30 వార్డులు, రూరల్ గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగరలో..

వైఎస్సార్ సీపీ కపిలేశ్వరపురం మండల కమిటీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ ఆధ్వర్యంలో అంగరలోని పార్టీ మండల కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ వాసా కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు అడ్డాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పరిషత్ విప్ పలివెల మధు, నాయకులు రేలంగి శ్రీనివాస్, పసలపూడి శ్రీనివాస్, పెద్దింశెట్టి అసిరిబాబు, కందుకూరి సత్యం, తేలు సత్యనారాయణ, చిల్లా లోవరాజు, నేలపూడి శ్రీను పాల్గొన్నారు.

పలువురికి ఉత్తమ సేవా అవార్డులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలువురు అధికారులు స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ సేవా అవార్డులకు ఎంపికయ్యారు. వారికి శుక్రవారం అమలాపురంలో మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ అవార్డులు అందించారు. రామచంద్రపురం ఆర్డీఓ దేవరకొండ అఖిల, ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ నుంచి ఎస్సై లక్ష్మణ్, మహిళా కానిస్టేబుల్ కనకదుర్గ, హోంగార్డు వెంకటేశ్వర్లు, ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణ, ఫైర్ ఇన్‌స్పెక్టర్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ వరాహలక్ష్మి, హౌసింగ్ ఇన్‌చార్జి డీఈ సుంకర రాంబాబు, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ సోని ప్రియదర్శిని, ఏజీపీ పద్మ కమల కుమారి తదితరులు ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికయ్యారు.

హౌసింగ్ ఏఈకి పురస్కారం

కాజులూరు: ప్రతి ఏటా విధినిర్వహణలో ప్రతిభ కనపరచిన ప్రభుత్వ ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఇచ్చే పురస్కారానికి గృహ నిర్మాణ శాఖ నుంచి కాజులూరు మండల ఏఈగా పనిచేస్తున్న శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ మేరకు కాకినాడ పెరేడ్ గ్రౌండ్‌లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని శ్రీనివాస్ అందుకున్నారు. ఎంపీపీ మాత భారతీ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకట సుబ్బారావు, గొల్లపాలెం ఉప సర్పంచ్ భువనేశ్వరీ దేవి, కాజులూరు పీఏసీఎస్ చైర్మన్ వెంకటరమణ తదితరులు శ్రీనివాస్‌కు అభినంధనలు తెలిపారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు

కె.గంగవరం: మండలంలోని విధుల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు జిల్లా స్థాయిలో పురస్కారాలు లభించాయి. కూళ్ల పంచాయితీ కార్యదర్శి ముద్రగడ చంటి, దంగేరు సచివాలయ మహిళా పోలీస్ శైలజ, ఇరిగేషన్ సబ్ డివిజన్ కోటిపల్లి కార్యాలయ అసిస్టెంట్ కటకం ఆనందరాజు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరికి అమలాపురంలో జరిగిన స్వాతంత్య్ర వేడుకల్లో మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. ఉత్తమ సేవలకు ఎంపికవడంతో వీరిని ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ శ్రీవరలక్ష్మీ, మాజీ సర్పంచ్ బత్తుల విజయకుమారి, మాజీ ఎంపీపీ పెట్టా శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పందు గోవిందరాజు, మాజీ జిల్లా వ్యవసాయ శాఖ సలహాదారు సభ్యులు బత్తుల అప్పారావు, సహచర ఉద్యోగులు తదితరులు అభినందించారు.



ఉత్తమ సేవా అవార్డు అందుకుంటున్న ఆర్డీఓ అఖిల



పవన్ కల్యాణ్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శ్రీనివాస్

వరించిన పురస్కారాలు

కపిలేశ్వరపురం: నియోజకవర్గ పరిధిలోని మండపేట, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల్లోని పలువురు ప్రభుత్వ విభాగాల అధికారులు, ఉద్యోగులకు స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా అవార్డులు దక్కాయి. అమలాపురంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ విధుల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు ఉత్తమ సేవా అవార్డులను అందుకున్నారు. మున్సిపల్ విభాగంలో మండపేట పట్టణంలో మెరుగైన పారిశుధ్య ప్రగతిని సాధించినందుకు మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పురస్కారాన్ని అందుకున్నారు. పాలతోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.వరప్రసాద్, వ్యవసాయ శాఖ నుంచి వెదురుమూడి గ్రామ వ్యవసాయ సహాయకురాలు డి.స్పందన, కపిలేశ్వరపురం మండల తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ పత్తి సత్తిబాబు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిని ఆయా మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు, సహ ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

పోలీస్ శాఖ నుంచి మండపేట పట్టణ సీఐ డి.సురేష్, ఏఎస్సై వెంకటేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణలు ఉత్తమ సేవా పురస్కారాలను అందుకున్నారు.







మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌ల నుంచి పురస్కారం అందుకుంటున్న మండపేట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, వ్యవసాయ సహాయకురాలు స్పందన, కంప్యూటర్ ఆపరేటర్ సత్తిబాబు



అమలాపురంలో పురస్కారాలను అందుకున్న ఏఎస్‌ఐ, సీఐ, హెచ్‌సీ

అధికారుల పొరపాట్లతో మహిళల ఇబ్బందులు

- ఏర్పాట్లు చేయడంలో విఫలం
- గంటలపాటు క్యూలైన్లో ఇబ్బంది పడ్డ మహిళలు



క్యూలేనులో ఇబ్బందులు పడుతున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఈఓ అల్లు వెంకట దుర్గా భవాని ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. ఆలయానికి వచ్చే రద్దీని అంచనా వేయడంలో విఫలమయ్యారు. సుమారు 5 వేల మందికి ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఉదయం 6 గంటలకు ఒక బ్యాచ్, 9 గంటలకు మరో బ్యాచ్ వ్రతాలు చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. చేసిన కొన్ని పొరపాట్లతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. పూజా సామాగ్రి అందించే కౌంటర్ ఒక్కటి మాత్రమే ఏర్పాటు చేయడంతో వేలాదిగా తరలివచ్చిన మహిళలు క్యూలైనులో అసౌకర్యానికి గురయ్యారు. క్యూలైన్ ఆలయం నుంచి కాకినాడ రోడ్డులో ఉన్న ద్రాక్షారామ పంచాయతీ వరకు సాగడంతో ఎండలో మహిళలు ఇబ్బంది పడ్డారు. స్పృహ తప్పి పడిపోయిన మహిళకు తోటి మహిళలు సపర్యలు చేశారు.


విజయదుర్గా పీఠం వార్షికోత్సవాలు ప్రారంభం

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గాపీఠం 53వ వార్షికోత్సవాలను నేటి నుంచి ఈ నెల 18వ తేది వరకు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 8.45 గంటలకు సూర్య హోరలో జ్యోతి ప్రజ్వలనతో వార్షికోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకృష్ణాష్టమి కావడంతో ఉదయం 9 గంటల నుంచి విశేష పూజలు నిర్వహించేందుకు సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. తదుపరి భక్తజన సంక్షోభ నివారణార్థం భద్రాచలం వేద పండితులచే శ్రీసీతారామచంద్రుల కళ్యాణం నిర్వహించనున్నారు. సాయంత్రం 6.15 గంటలకు శ్రీసాయి సత్సంగ నిలయం, పీఠం మహిళా భక్తులచే శక్తి మాల సహిత మణిద్వీప వర్ణన శ్లోకాల పారాయణం, నవదుర్గల సుహాసిని పూజ చేపట్టనున్నారు. వార్షికోత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు.

బస్ షెల్టర్ ప్రారంభం

రామచంద్రపురం రూరల్: మండలంలోని చోడవరంలో జుత్తుక యేసుదాస్ మినిస్ట్రీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో యేసుదాస్ కుమారుడు రెవరెండ్ డాక్టర్ జుత్తుక పీటర్ వరప్రసాద్ బాబు బస్ షెల్టర్ నిర్మించి శుక్రవారం ప్రజలకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ నేదునూరి సంతోషమ్మ, సీనియర్ పాస్టర్ పలివెల ఎలీయా, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో సీటు కైవసం



చప్పిడి మౌర్య

పి.గన్నవరం: మండలంలోని ఆర్.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన చప్పిడి మౌర్య సంజీవ వర్ధన్ ప్రతిభ కనబరిచి సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ (సీటీయూ) విజయనగరం కళాశాలలో సీటు సాధించాడు. ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ యూనివర్శిటీ కామన్ టెస్ట్ (సీయూఈటీ)లో అత్యధిక మార్కులు సాధించాడు. దీంతో సీటీయూ విజయనగరం కళాశాలలో బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ స్పెషలైజేషన్ సీటును సాధించినట్టు విద్యార్థి తల్లిదండ్రులు చప్పిడి కిరణ్మయి, శ్రీరామశెట్టి విలేకరులకు తెలిపారు.

బ్యాటరీ కార్లు ప్రారంభం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం దాత బహూకరించిన రెండు బ్యాటరీ కార్లను శుక్రవారం ప్రారంభించారు. స్వామి దర్శనానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం మెర్లపాలెంకి చెందిన జేఎస్ఎన్ రాజు కన్‌స్ట్రక్షన్స్ అధినేత జంపన సూర్యనారాయణరాజు రూ.12 లక్షలు విలువైన రెండు బ్యాటరీ కార్లు సమకూర్చారు. ఈ సందర్భంగా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో దాత సూర్యనారాయణరాజును ఘనంగా సత్కరించారు.

వైభవోపేతంగా శ్రావణమాసం పూజలు



రాయవరంలో పండ్లు, కూరగాయలతో నయనానందకరంగా శోభిల్లుతున్న పార్వతిదేవి

రాయవరం: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణ మాసం నాల్గొవ శుక్రవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పీఠాన్ని సందర్శించుకున్నారు. మండలంలో పలు ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పుష్పాలతో ముస్తాబు చేశారు. రాయవరం, సోమేశ్వరం, వెంటూరు, చెల్లూరు తదితర ఆలయాల్లో వేకువ జాము నుంచే మహిళలు ఆలయాలకు తరలి వచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రాయవరంలోని పార్వతి సమేత రాజేశ్వరస్వామి అమ్మవారిని పండ్లు, కూరగాయలతో నయనానందకరంగా అలంకరించారు. సోమేశ్వరంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారికి ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని, స్వామివారిని నేత్రపర్వంగా అలంకరించారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారికి పురోహితులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

పెద్దమ్మ తల్లికి సారె

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణం ఏడిద రోడ్డులోని కొలువైయున్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసంలోని 4వ శుక్రవారం నేపథ్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రావణ శనివారం సందర్భంగా అమ్మవారికి పలువురు భక్తులు సారె సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు తెలిపారు.